సాక్షి కర్నూలు

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



శ్రీగిరి..భక్తజన సందడి

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కన్నడిగులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తున్నారు. భక్తులు రాకతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోతున్నాయి. 8లో▸



సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి, జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన కాలాబ్లోమ్ ఆర్ట్స్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:45
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:48
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:42
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:43
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:43

హదీస్ వెలుగు :

తప్పులు చేయడం అంటే కేవలం చేతులతోనే కాదు. మాటలు, చెవులు, చూపులతోనూ తప్పులు జరుగుతాయి. వాటన్నింటి నుంచి నియంత్రణలో ఉండాలి. – పవిత్ర ఖురాన్



తల్లి మాసాబీని దొబ్బుడు బండిలో సచివాలయానికి తీసుకెళ్తున్న వ్యక్తి పేరు సలీమ్‌బాషా. ఎండలు మండిపోతున్నాయని, ముసలోళ్లని ఇలా బయట తిప్పితే ప్రాణం పోయేలా ఉందని వాపోతున్నాడు. ఐదేళ్లుగా ఎలాంటి అవస్థలు లేకుండా వచ్చిన పింఛను ఇప్పుడు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని, ఎలాగైనా ఇంటికే పింఛను వచ్చేలా చేయాలని వేడుకుంటున్నాడు. పింఛను కోసం పనులను మానుకొని తల్లిని సచివాలయానికి తీసుకొచ్చానన్నాడు. ముసలోళ్లతో రాజకీయం చేయడం టీడీపీ నేతలకు తగదన్నాడు. – పెద్దకడబూరు

చంద్రబాబు ఏడిపింఛన్!

- టీడీపీ కుట్రలతో మండే ఎండల్లో పింఛన్ కష్టాలు
- వలంటీర్లు దూరం కావడంతో సచివాలయాల వద్ద పడిగాపులు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వృద్ధులు, దివ్యాంగులు
- టీడీపీ అధినేత తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- మధ్యాహ్నం నుంచి మొదలైన పింఛన్ల పంపిణీ
- మొదటి రోజు జిల్లాలో 90,355 మందికి అందిన పింఛన్లు

టీడీపీ కుట్రలతో మళ్లీ పింఛన్ కష్టాలు మొదలయ్యాయి. ఇంటి వద్దనే ఠంచన్‌గా ఒకటో తేదీన వలంటీర్లతో పింఛన్లు అందుకోవాల్సిన అవ్వాతాతలు గడపదాటారు. ఎర్రటి ఎండలో నడవలేని స్థితిలో సచివాలయానికి వెళ్లలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. సహాయకులతో వెళ్లిన దివ్యాంగులకు నిరీక్షణ తప్పనిసరైంది. మొదటి రోజు మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలైంది. వేలి ముద్రలు పడక.. వృద్ధులు, దివ్యాంగులు ఇక్కట్లకు గురయ్యారు. తమకు కష్టాలు తెచ్చి పెట్టిన టీడీపీ అధినేత చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.



కోసిగి సచివాలయం -1 వద్ద వేచి ఉన్న వృద్ధులు

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్ల పంపిణీలో టీడీపీ హయాం నాటి పరిస్థితులు మళ్లీ పునరావృతమయ్యాయి. జిల్లాలో బుధవారం పింఛన్ల పంపిణీ మొదలు కాగా.. అప్పటి పరిస్థితులు మళ్లీ కనిపించాయి. సచివాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎర్రటి ఎండలో విలవిల్లాడాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి పింఛన్ల పంపిణీలో మార్పులు తీసుకొచ్చింది. వలంటీర్లను ఏర్పాటు చేసి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్ అందించే సౌకర్యం కల్పించింది. వానొచ్చినా.. వరదొచ్చినా.. సెలవొచ్చినా.. వలంటీర్లు ఠంచన్‌గా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్లు ఇచ్చేవారు. టీడీపీ హయాంలో పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్లు ఇచ్చేవారు. లబ్ధిదారులను రోజుల తరబడి తిప్పుకునేవారు. కార్యాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పడిగాపులు కాయలేక నరకం అనుభవించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు నిస్వార్థంగా సేవలు అందిస్తుండటంతో టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు పన్ని తను అనుబంధ సంస్థ ద్వారా కోర్టులో కేసు వేయించి.. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వారిని పింఛన్ల పంపిణీకి దూరం చేశారు. దీంతో నాటి పరిస్థితులే మళ్లీ బుధవారం కనిపించాయి. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు ఇలా 16 రకాల పింఛన్‌దారులు చంద్రబాబు అండ్ కో కుట్రలు, కుతంత్రాలకు మండే ఎండల్లో రోడ్డున పడాల్సి వచ్చింది. సచివాలయాల దగ్గర వీరంతా పడిగాపులు గాయడం ఆందోళనకు గురి చేసింది.

మొదటి నుంచి అదే తీరు..

వలంటీర్ వ్యవస్థ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచింది. ఈ వ్యవస్థను దెబ్బతీయడానికి టీడీపీ అధినేత చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ మరీ దారణంగా వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ముఠా ఎన్ని కుతంత్రాలకు పాల్పడినప్పటికీ 2024 మార్చి నెల వరకు వలంటీర్ వ్యవస్థను దెబ్బతీయలేకపోయారు. ఎన్నికల కోడ్ రావడంతో చంద్రబాబు ముఠా కుతంత్రాలు పనిచేశాయి. పచ్చపార్టీ కుట్రలు, కుతంత్రాలను భుజానికెత్తుకున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో వలంటీర్ వ్యవస్థను దెబ్బతీయడం లక్ష్యంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. దీంతో వలంటీర్లను పింఛన్ల పంపిణీతో సహా సంక్షేమ పథకాల అమలుకు దూరం చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

కన్నీళ్లు పెట్టుకున్న వృద్ధులు

దాదాపు ఐదేళ్లపాటు ఇంటిదగ్గరే పింఛన్ అందుకున్న అవ్వాతాతలు బుధవారం ఆయాసపడుతూ.. నడవలేక కర్రల ఆసరాతో సచివాలయాలకు చేరుకున్న దృశ్యాలు జిల్లాలో అన్ని చోట్లా కనిపించాయి. ఎండల్లోనే పింఛన్ కోసం కాచుకొని కూర్చోవలసి వచ్చింది. వచ్చిన వారందరూ చంద్రబాబు కారణంగానే మళ్లీ కష్టాలు మొదలయ్యాయని చర్చించుకోవడం కనిపించింది. అధికారంలో లేకపోయినప్పటికీ చంద్రబాబు ఇంటిదగ్గరే పింఛన్లు పంపిణీ చేయడాన్ని అడ్డుకున్నారని, ఆయన అధికారంలోకి వస్తే మనకు కష్టాలు, కన్నీళ్లేనంటూ ఆందోళనకు గురయ్యాయి. మాకెందుకు ఇన్ని కష్టాలు అంటూ కొందరు వృద్ధులు కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు కనిపించాయి. పింఛన్లు అందేవేమోనని చాలా మంది ముందుగానే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 1,188 సచివాలయాలు ఉండగా... ఉదయం నుంచే పింఛన్‌దారులతో పోటెత్తాయి. దివ్యాంగులు, వయోవృద్ధులు, డయాలసిస్ పేషెంట్లు, మంచానికి పరిమితమైన వారు తదితరులకు మొదటి రోజున ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవు.

ఆలస్యంగా పంపిణీ

బుధవారమే బ్యాంకులకు పింఛన్లకు సంబంధించిన నగదు విడుదలైంది. దీంతో నగదును డ్రా చేయడంలో ఆలస్యమైంది. ఫలితంగా మధ్యాహ్నం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. కర్నూలు జిల్లాలో 2,46,871 పింఛన్ లబ్ధిదారులు ఉండగా...సాయంత్రం 7 గంటల సమయానికి 90,355 (36.60 శాతం) మందికి అందజేశారు. గూడూరు అర్బన్‌లో 281, మద్దికెరలో 395, ఎమ్మిగనూరు మండలంలో 2,433, నందవరం మండలంలో 980, కోడుమూరులో 2,259, సి.బెళగల్‌లో 426 , కర్నూలు అర్బన్‌లో 12,899, కర్నూలు మండలంలో 6,692, ఆదోనిలో 6,771,ఆదోని అర్బన్‌లో 8,553 మందికి పింఛన్లు అందాయి. గురు, శుక్రవారాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేస్తారు. శుక్రవారం సాయంత్రానికి పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది.



గోనెగండ్లలో వాకర్ సాయంతో పింఛన్ కోసం వెళ్తున్న తాత



కర్నూలు పాతబస్టాండ్‌లోని సచివాలయం రెండవ అంతస్తులో ఉండటంతో పింఛన్ల కోసం మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు



కర్నూలు నగరం పాతబస్టాండ్‌లోని 5వ సచివాలయంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయండి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఉష్ణోగ్రతలు 41, 42 డిగ్రీలు ఉన్న నేపథ్యంలో ప్రతి సచివాలయం దగ్గర షామియానా, కుర్చీలు వేసి మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. పింఛన్ల పంపిణీపై మండలాల ప్రత్యేకాధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో బుధవారం ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నడిచి రాగలిగే వారికి, తక్కువ వయస్సు ఉన్న డప్పు కళాకారులు, ఒంటరి మహిళలకు సచివాలయాల్లోనే పింఛన్లు ఇవ్వాలన్నారు. వివిధ ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అస్వస్థతతో ఉన్నవారు, మంచానికే పరిమితమైన వారు, నడవలేక వీల్‌చైర్‌లో ఉన్న వారు, సైనిక సంక్షేమ పింఛన్ పొందుతున్న మహిళలకు సచివాలయ సిబ్బంది ఇంటికే వెళ్లి పింఛన్ ఇవ్వాలన్నారు. అవసరమైతే మజరా గ్రామంలోనే పింఛన్ల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అందరూ ఫీల్డ్‌కు వెళ్లకూడదని, కొంత మంది సచివాలయంలో ఉండి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీపై గంట గంటకు స్టేటస్ రిపోర్టులను మానిటర్ చేస్తూ ఉండాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని ఆదేశించారు. పంపిణీ ప్రక్రియను ఏప్రిల్ 5వ తేదీలోపు పూర్తి చేయాలని, అప్పటికీ మిగిలి ఉంటే ఏప్రిల్ 6వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు.



ఆస్పరిలో పింఛన్ తీసుకునేందుకు సచివాలయానికి నడిచి వస్తున్న వృద్ధుడు



కోసిగిలో వృద్ధులను బైక్‌పై సచివాలయానికి తీసుకెళ్తున్న దృశ్యం

ఉదయం నుంచి కూర్చొన్నా



ప్రతినెలా 1వ తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవాడు. 3వ తేదీ అయినా పింఛన్ రాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక బాధపడుతున్నా. నిన్న రాత్రి పంచాయతీ అధికారులు 3వ వార్డు సచివాలయానికి వస్తే పింఛన్ ఇస్తారని చెప్పడంతో ఉదయం 9 గంటలకే సచివాలయం దగ్గరకు వచ్చి కాసుకొని కూర్చొన్నా. సాయంత్రం 4 గంటలైనా పింఛన్ అందలేదు. తీరిగ్గా అధికారులు వచ్చి పింఛన్‌ను ఇచ్చారు. – లింగాలదిన్నె దొడ్డయ్య, పెద్దతుంబళం, ఆదోని మండలం

మా ఉసురు తగులుతుంది



ఐదేళ్లు పింఛన్ ఇంటి వద్దనే తీసుకునేవాళ్లం. టీడీపీ వారికి ఏమి రోగం పుట్టిందో ఏమో? వలంటీర్లు పనిచేయకుండా, మాకు పింఛన్ ఇవ్వకుండా చేశారు. సచివాలయానికి వచ్చేందుకు మాకు ఎంత ఇబ్బంది ఉందో తెలుసా? ఇప్పుడు మమ్ముల్ని ఇబ్బందులు పెడితే వారు బాగుపడుతారా? వారు మా ఉసురు తలిగిపోతారు. – నాగలక్ష్మమ్మ, వృద్ధురాలు, సి.బెళగల్

ఇన్ని ఇబ్బందులు ఎప్పుడూ చూడలేదు



ఐదేళ్లుగా ప్రతి నెలా ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చేవారు. ఏమైందో ఏమో సచివాలయంలో పింఛన్ తీసుకోవాలని చెప్పారు. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. బుధవారపేట సచివాలయంలోనే వేచి ఉన్నాం. మధ్యాహ్నం వరకు పింఛన్ ఇవ్వలేదు. ఇంతకాలం వలంటీర్లే ఇంటికి వచ్చి ఇచ్చేవారు. ఎందుకు ఇన్ని ఇబ్బందులు పెడుతున్నారు. మాలాంటి పేదలపైనా మీ ప్రతాపం? – శాంతమ్మ, బుధవారపేట, కర్నూలు



హొళగుంద సచివాలయానికి ఎండలో నడిచి వస్తున్న వృద్ధులు, వితంతువులు



హాలహర్వి మండలం సిద్ధాపురంలో ఆరుబయట పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

న్యూస్‌రీల్

ఆప్కోకు పెరిగిన ఆదాయం

- ఈ ఏడాది రూ.2.78 కోట్ల వ్యాపారం

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత వస్త్రాల వ్యాపారాన్ని ఆప్కో పెంచుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆప్కోకు ఎనిమిది షోరూములు ఉండగా ఈ ఏడాది (2023-24) రూ.4.74 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్మాన్ని నిర్దేశించారు. పవర్‌లూమ్ వస్త్రాల నుంచి పోటీ తీవ్రంగా ఉండటంతో లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. అయితే 2022-23తో పోలిస్తే ఆప్కో వ్యాపారం పెరిగింది. 2022-23లో రూ.2.64 కోట్ల వ్యాపారం చేయగా.. 2023-24లో రూ.2.78 కోట్ల వ్యాపారం జరిగినట్లు డివిజనల్ మేనేజర్ భారతి తెలిపారు. ఈ ఏడాది రూ.14 లక్షల ఆదాయం పెరిగినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత వస్త్రాల కొనుగోలుపై 30 శాతం వరకు రాయితీ లభిస్తుందని, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 50 శాతం వరకు రాయితీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఉగాది, శ్రీరామ నవమి, రంజాన్ పండగల నేపథ్యంలో చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరారు.

నేటితో ముగియనున్న ఇంటర్ ‘స్పాట్’

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల మూల్యాంకనం గురువారంతో ముగియనుంది. గత నెల 18న నుంచి మూల్యాంకనం మొదలుకాగా.. మొదట్లో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల అధ్యాపకులు హాజరు కాలేదు. దీంతో 132 మందికి అధ్యాపకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరుశాతం పెరిగింది. ప్రస్తుతం గణితం 2,400, ఫిజిక్స్ 2,356, కెమిస్ట్రీ 2,110 సమాధాన పత్రాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం క్యాంపులో 300 మందికిపైగా అసిస్టెంట్ ఎగ్జామినర్లు విధులు నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నానికి స్పాట్‌వాల్యుయేషన్ పూర్తయ్యే అవకాశం ఉంది.

‘స్పాట్’ కేంద్రం తనిఖీ

కర్నూలు సిటీ: స్థానిక ఏ క్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని ఆర్జేడీ వై.రాఘవరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పాట్‌వాల్యుయేషన్ పారదర్శకంగా చేయాలని, ఎక్కడ పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బీఈడీ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబర్‌లో నిర్వహించి బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2,964 మంది విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 770 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

పశుసంవర్ధకశాఖ జేడీ బాధ్యతల స్వీకరణ



గుడివాడ శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా గుడివాడ శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి గ్రామానికి చెందిన ఈయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని స్టేట్ అనిమల్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ముందుగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను మర్యాదపూర్వకంగా కలసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాల్లో మొదటిసారిగా పనిచేసే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. మూగజీవాలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విధాలా కృషి చేస్తామన్నారు.

పీజీసెట్ నోటిఫికేషన్ విడుదల

- ఆర్‌యూ పరిధిలో 16 కోర్సులు
- అందుబాటులో 1,835 సీట్లు



కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు మూడో సంవత్సరం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఏపీ పీజీసెట్-2024 నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 14 వర్సిటీలకు కలిపి ఒకే పరీక్ష నిర్వహించనున్నారు. జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలతో బయటకి వస్తున్నారు. వీరిలో 50 శాతం అంటే సుమారు లక్ష మంది విద్యార్థులు పీజీ పరీక్షలు రాస్తుంటారు. ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తుండటంతో పీజీ సెట్ రాసే విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలో రాయలసీమ విశ్వవిద్యాలయంలో 12 పీజీ కోర్సులు ఉండగా 580 సీట్లు, 10 అనుబంధ పీజీ కళాశాలల్లో 10 కోర్సులకు 934.. మొత్తం 1,514 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ముఖ్యమైన సమాచారం

- ఏపీ పీజీసెట్-2024ను ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తోంది.
- ఎలాంటి ఫైన్ లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు మే 4వ తేదీ వరకు అవకాశం ఉంది.
- దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలి.
- సబ్జెక్టుల వారీగా ప్రవేశ పరీక్షలు జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తారు.
- ఒక సబ్జెక్టుకు దరఖాస్తు ఫీజు ఓసీలు రూ.850, బీసీలు రూ.750, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.650 చెల్లించాలి.

ప్రతిభావంతులు వస్తారు

ఉన్నత విద్యా మండలి మూడు సంవత్సరాలుగా ఏపీ పీజీసెట్ పేరుతో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. దీంతో వర్సిటీల్లోకి ప్రతిభావంతులైన విద్యార్థులు వస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు అన్ని వర్సిటీల్లో చేరే అవకాశం ఉంటుంది. దీంతో మల్టీ కల్చర్ డెవలప్ అవుతుంది. ప్రవేశాలు పారదర్శకంగా జరుగుతాయి.

– బి. సుధీర్ ప్రేమ్‌కుమార్, వైస్ చాన్సలర్, రాయలసీమ యూనివర్సిటీ

నిప్పులు కక్కుతున్న భానుడు



కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రత, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం పట్ల సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో రహదారులు దాదాపు నిర్మానుష్యం అవుతున్నాయి. బనగానపల్లి మండలం నందవరంలో 43.78 డిగ్రీలు, పాణ్యం మండలం అనుపూర్‌లో 43.4, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో 43.27, కోడుమూరు మండలం లద్దగిరిలో 43.29, బండిఆత్మకూరు మండలం పెద్ద దేవలాపురంలో 43.2, మంత్రాలయంలో 43.09 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుండటం, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు.

ఎల్‌పీ నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు



మాట్లాడుతున్న జేసీమౌర్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో రీసర్వే జరిగే గ్రామాల్లో ఎల్‌పీ(ల్యాండ్ పార్శిల్) నంబర్ల ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి మార్కెట్ విలువ నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నంబర్లతో పనిలేకుండా ఎల్‌పీ నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లను చేయాలన్నారు. ఎల్‌పీ నంబర్లను సర్వే నంబర్లతో మ్యాపు చేసి భూముల రిజిస్ట్రేషన్ విలువను అనుసంధానించినట్లు చెప్పారు. ఇందులో మార్కెట్ విలువల పెంపుదల ఉండదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఇక మీదట రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీ నంబర్ల ఆధారంగానే రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయని, ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు, కుడా వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి, సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్‌జేడీ పరామర్శ

కర్నూలు సిటీ: గోనెగండ్ల మండలం పుట్ట పాశం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నొస్సం రాజశేఖర్ శర్మ గత నెల ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకోగా.. ఆయ న కుటుంబాన్ని బుధవారం ఆర్జేడీ వై.రాఘవరెడ్డి పరామర్శించారు. ఉపాధ్యాయుడి కుటుంబం కర్నూలు నగర శివారులోని స్కంద లోటస్ విల్లాస్‌లో నివాసం ఉంటోంది. బుధవారం కర్నూలుకు వచ్చిన పాఠశాల ఆర్జేడీ వై.రాఘవరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు సంబంధించి కారణాలను తెలుసుకునేందుకు వ్యక్తిగతంగా ప్రాథమిక విచారణ చేస్తున్నామని చెప్పారు. ఇందులో తప్పు ఉన్నట్లు తెలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఉపాధ్యాయులు ఏ సమస్యలు ఉన్నా కూడా ఆత్మహత్యలకు పాల్పడకూడదని, ఏదైనా సమస్యలు ఉంటే పైఅధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రావెల్, మెటల్ అక్రమంగా తరలిస్తున్న ఆరు టిప్పర్లను బుధవారం సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. రూ.1.5లక్షల అపరాధ రుసుం విధించామని పేర్కొన్నారు. ఐదు గ్రావెల్ టిప్పర్లను కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో, ఒక మెటల్ టిప్పర్‌ను ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు.


మరో మహిళా కూలీ మృతి


లక్ష్మిదేవి (ఫైల్)

మద్దికెర: మార్చి 31వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మిదేవి (35) అనే మహిళా కూలీ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందడంతో ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మదేవిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించగా మూడు రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక చనిపోయారన్నారు. మృతురాలికి భర్త కురువ మల్లేష్, కుమారుడు వినయ్, కుమార్తె వినీత ఉన్నారు. ప్రమాదంలో గాయపడిన మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది.

చేతివృత్తులకు 'చేదోడు'

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.100 కోట్లతో పథకం అమలు
- లక్ష మందికిపైగా అందిన ఆర్థిక సాయం
- కరోనా కష్టకాలంలోనూ అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు



కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జగనన్న చేదోడు పథకం లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. కుల, చేతి వృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు ఈ పథకం కింద ప్రతి ఏడాది రూ.10 వేల చొప్పున అందించింది. చేసేది చిరు సాయమైనా, వారి కష్టాలను గుర్తించి ఆదుకుంటున్న తీరు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వాలు కేవలం కంటి తుడుపు చర్యలు చేపట్టగా, రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ప్రతి ఏడాది ఠంచన్‌గా నగదును బదిలీ చేస్తోందని ఆయా వర్గాలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. జగనన్న చేదోడు పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు నాలుగు విడతలుగా ఉమ్మడి జిల్లాలోని 1,02,452 మంది లబ్ధిదారులకు రూ.102,45,20,00ల నగదు జమ అయ్యింది.

పక్కాగా అమలు

టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఏడాదికి రూ.10 వేల ప్రకారం ఆర్థిక సహకారాన్ని అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కాగా అమలు చేస్తోంది. 2020 జూన్ 10వ తేదీన పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఎలాంటి ఆటంకం లేకుండా నాలుగేళ్లుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అయ్యింది. దీంతో ఆయా చేతి వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు 'జగనన్న చేదోడు' ఒక వరంగా ఆదుకుంటోంది. చూడ్డానికి చిన్న మొత్తమే అయినా ... టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఇది పెద్ద మొత్తమే. వారి వృత్తులను అభివృద్ధి చేసుకునేందుకు ఈ మొత్తంతో అవసరమైన ముడి సరుకును తెచ్చుకొని జీవనం సాగిస్తున్నారు. కుల వృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారికి ఈ పథకం ఆర్థికంగా అండగా నిలుస్తోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

కరోనా కష్టకాలంలో కూడా ...

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన సమయంలో రెండు సంవత్సరాలు కరోనాతో వివిధ ప్రాంతాల్లో కర్ఫ్యూ, లాక్‌డౌన్‌తో జన జీవనం స్తంభించిపోయింది. ఈ సందర్భంలో కూడా ప్రభుత్వం ఎలాంటి వెనకడుగు వేయలేదు. ఓ వైపు బయట తిరిగి పనులు చేసుకునేందుకు కూడా వీల్లేని పరిస్థితుల్లో కుటుంబాలు గడవడం కష్టంగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వెనకడుగు వేయకుండా చేతి వృత్తులు చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగరాదనే దృఢ సంకల్పంతో ఈ పథకంలో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేసింది.

నాలుగు విడతల వివరాలు...

కర్నూలు జిల్లా ...

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
టైలర్లు	26,180	రూ.26.180
రజకులు	14,035	రూ.14.035
నాయీ బ్రాహ్మణులు	9,955	రూ.9.955
మొత్తం:	50,170	రూ.50.170

నంద్యాల జిల్లా ...

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
టైలర్లు	17,620	రూ.17.620
రజకులు	27,184	రూ.27.184
నాయీ బ్రాహ్మణులు	7,478	రూ.7.478
మొత్తం:	52,282	రూ.52.282

అభివృద్ధి దిశగా చేతి వృత్తులు ...

రాష్ట్ర ప్రభుత్వం రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల ప్రకారం అందిస్తున్న ఆర్థిక సాయంతో వారు చేతి వృత్తులను అభివృద్ధి చేసుకుంటున్నారు. రజకులు వారి కుల వృత్తికి అవసరమైన డ్రమ్ములు, ఇస్త్రీ పెట్టెలు, బొగ్గులు తదితర సామాగ్రికి ఈ నగదును ఉపయోగించుకుంటున్నారు.టైలర్లు,నాయీ బ్రాహ్మణులువారికి అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసి షాపులను అభివృద్ధి పరచుకుంటున్నారు.

నాయీ బ్రాహ్మణులకు మేలు చేకూరింది



కుల వృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్న రూ.10 వేలతో షేవింగ్ సెలూన్‌కు అవసరమైన ఫేషియల్స్, కాస్మొటిక్స్ మెటీరియల్‌ను కొనుగోలు చేసుకుంటున్నా. గతంలో ఏ ప్రభుత్వం కూడా నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకోవాలని ఆలోచించ లేదు. ఈ పథకం వల్ల నాయీ బ్రాహ్మణులకు ఎంతో మేలు చేకూరింది.

– ఆదినారాయణ, కోడుమూరు

రజకులకు ఎంతో ఉపయోగకరం



జగనన్న చేదోడు పథకంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.10 వేలు ఇవ్వడం వల్ల పేద రజకులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు నాకు నాలుగు విడతలుగా రూ.40 వేలు వచ్చాయి. ఇళ్ల వద్ద, వేర్వేరు ప్రాంతాల్లో చిన్న చిన్న బంకులు పెట్టుకొని కుల వృత్తి చేసుకుంటున్న రజకులు అనేక మంది ఈ పథకం ద్వారా అందిన నగదుతో కొత్త ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుగోలు చేసుకున్నారు. ఈ డబ్బులను ప్రభుత్వం ఇవ్వడం వల్ల వారికి అప్పులు చేసే తిప్పలు తప్పింది. రజకులను ఆదుకుంటున్న జగనన్నకు రుణ పడి ఉంటాం.

– చాకలి నాగవేణి, ఆలూరు

టీడీపీ నేతల కోడ్ ఉల్లంఘన

- నోటీసులు జారీ చేసిన ఎన్నికల అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల కోడ్‌ను టీడీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ముందస్తు అను మతి తీసుకొని సోషల్ మీడియాలో ప్రచారం చేయాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు బేఖాతరు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన చైర్మన్‌గా ఉన్న ఎంసీఎంసీ కమిటీ సోషల్ మీడియా పోస్టులపై నిఘా వేసింది. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే టీడీపీ నాయకులను గుర్తించింది. కర్నూలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రారెడ్డి, ఆదోని బీజేపీ అభ్యర్థి పార్థసారథి, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్, పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యామ్‌బాబు విస్తృతంగా సోషల్ మీ డియాలో పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. ఆ యా నియోజకవర్గాల ఆర్‌ఓలు అభ్యర్థులకు నోటీసులు ఇచ్చారు. వీరితోపాటు అనుమతి లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న మరికొందరికి నోటీసులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

సంగాలలో పట్టపగలు చోరీ

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో పట్ట పగలు కురువ నాగరాజు ఇంట్లో దొంగలు పడ్డారు. బీరువాలో దాచిన మూడున్నర తులాల బంగారు నగలు, 20 తులాల వెండి పట్టీలను అపహరించారు. కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ పనులకు వెళ్లగా మంగళవారం ఈ చోరీ జరిగింది. సమాచారం అందుకున్న వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్ రెడ్డి బుధవారం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కర్నూలు నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలిముద్రల ఆధారాలను సేకరించారు. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మూడు నాబార్డు ప్రాజెక్టుల అమలు

- తుగ్గలి మండలంలో రూ.3.50 కోట్లతో మాతోట ప్రాజెక్టు
- దేవనకొండ, పత్తికొండ మండలాలకు వాటర్‌షెడ్ ప్రాజెక్టులు
- మద్దికెరలో రూ.15.50 లక్షలతో గ్రామ సంత నిర్మాణం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో మూడు నాబార్డు ప్రాజెక్టులు అమలవుతున్నాయని డీడీఎం సుబ్బారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. తుగ్గలి మండలంలోని 8 గిరిజన తండాల్లోని 500 కుటుంబాల అభివృద్ధి లక్ష్యంగా రూ. 3.50 కోట్లతో మాతోట ప్రాజెక్టును నాబార్డు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి రైతుకు ఒక ఎకరాలో మామిడి, జామ మొక్కలు నాటి, వాటిని నాలుగేళ్ల పాటు మెయిన్‌టెనెన్స్ చేస్తామని తెలిపారు. మాతోట ప్రాజెక్టును అపార్డు స్వచ్ఛంద సంస్థ చేపడుతోందని పేర్కొన్నారు. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద పత్తికొండ మండలం జేఎం తండాలో రూ.84 లక్షలతో వాటర్‌షెడ్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇక్కడ 500 ఎకరాల్లో వాటర్‌షెడ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేవనకొండ మండలం మాచాపురం గ్రామానికి రూ.2.50 కోట్లతో వాటర్‌షెడ్ ప్రాజెక్టు మంజూరు అయిందని, 1000 ఎకరాల్లో వాటర్‌షెడ్ కార్యాక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వాటర్‌షెడ్ ప్రాజెక్టులను నవయూత్ స్వచ్ఛంద సంస్థ చేపడుతుందని పేర్కొన్నారు. కాగా నాబార్డు నిధులు రూ.15.50 లక్షలతో మద్దికెరలో రైతుబజార్(గ్రామ సంత) నిర్మిస్తున్నట్లు తెలిపారు. సంత నిర్మాణం పనులు కూడా చురుగ్గా జరుగుతాయని వివరించారు.


కైలాసద్వారం వద్దకు చేరుకున్న కన్నడ భక్తులు


పల్లకీని మోసుకుంటూ వస్తున్న కన్నడ భక్తులు


కాళ్లకు కర్రలు కట్టుకుని పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తుడు

శ్రీగిరి.. భక్తజన సందడి

- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నల్లమల అటవీమార్గంలో పాదయాత్రగా తరలివస్తున్న కన్నడిగులు


నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా తరలివస్తున్న కన్నడ భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో కన్నడ భక్తుల సందడి నెలకొంది. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని రేపటితో మల్లన్న స్పర్శదర్శనం నిలిపేయనుండటంతో భక్తులు తండోపతండాలుగా శ్రీగిరికి తరలివస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి కన్నడిగులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తున్నారు. ఆత్మకూరు నుంచి వెంకటాపురం చేరుకుని అక్కడి నుంచి దట్టమైన నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా తరలివస్తున్నారు. మఠంబావి, పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం అక్కడి నుంచి హఠకేశ్వరం, సాక్షిగణపతి మీదుగా శ్రీశైలం చేరుకుంటున్నారు. మల్లికార్జున స్వామి స్వరూపంగా భావించే పల్లకీని మోసుకుంటూ ఉదయం సాయంత్రం పల్లకీ(కంభి)కి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. హే మల్లయ్య హే, శివనామస్మరణ చేసుకుంటూ భక్తులు శ్రీగిరి చేరుకుంటున్నారు.

మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులు తీరుతున్నారు. తమ ఇంటి దైవం భ్రమరాంబా దేవిని, తమ అల్లుడిగా భావించే మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందుతున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోతున్నాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగుతోంది. క్యూలైన్లలో, ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచివున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. విడతల వారీగా మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నారు. రేపటితో మల్లన్న స్పర్శదర్శనం ముగియనుంది. ఈనెల 6 నుంచి భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం కల్పించనున్నారు.


మల్లన్న దర్శనానికి బారులుతీరిన కన్నడ భక్తులు

మొక్కజొన్నలో దిగుబడులు ఆశాజనకం

- రబీలో జిల్లాలో 22 వేల ఎకరాల్లో సాగు
- ముమ్మరంగా కోత, నూర్పిడి పనులు


సాదరదిన్నె సమీపంలో మొక్కజొన్న దిగుబడులను ఆరబోసిన దృశ్యం

కోవెలకుంట్ల: ఈ ఏడాది మొక్కజొన్న సాగు రైతులకు అన్ని విధాలా కలిసొచ్చింది. రబీ సీజన్‌లో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోయినా సాగునీటి వనరుల ద్వారా సాగునీరు పుష్కలంగా అందటంతో దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. జిల్లాలోని 29 మండలాల పరిధిలో రబీలో 22 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్‌లో అత్యధికంగా 10,053 ఎకరాలు, నందికొట్కూరు 2,962, నంద్యాల 2,605, కోవెలకుంట్ల 1,891, ఆత్మకూరు 1,307, డోన్ సబ్ డివిజన్‌లో 1,179, పాణ్యం, గడివేముల మండలాల్లో 1,408 ఎకరాల్లో సాగైంది. పంటకాలం 105 నుంచి 110 రోజులు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోయినా ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, పాలేరు, కుందూనది, కుందరవాగులకు అధికారులు సకాలంలో నీటిని విడుదల చేయడంతో పైరు ఏపుగా కాపు కూడా బాగా వచ్చింది. ప్రస్తుతం మొక్కజొన్న కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా వస్తుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు



ఈ ఏడాది రబీలో నాకున్న ఐదు ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర వాటికి ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడులు పెట్టాను. ఎస్సార్బీసీ, బోరు ఆధారంగా నాలుగు తడులు పైరుకు అందించాను. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో మద్దతు ధర ఉంది.

– కానాల శివరామకృష్ణారెడ్డి, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి



ఈ ఏడాది రబీ సీజన్‌లో 7.45 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. మూడు దఫాలు సాగునీటిని మళ్లించాను. రసాయన ఎరువులు, పురుగు మందులు, కోత, నూర్పిడి, తదితర వాటికి ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పెట్టాను. వాతావరణం అనుకూలించి పంట చేతికందటంతో ఇటీవలే కోత, నూర్పిడి పనులు చేపట్టాను. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి.

– సురేష్, రైతు, బిజనవేముల, కోవెలకుంట్ల మండలం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఐదు ఎకరాల సొంత పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగుచేశాను. ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వచ్చాయి. గతంలో పంట ఉత్పత్తుల కొనుగోలుకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేది. ప్రస్తుత మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటా రూ.2 వేలు ధర పలుకుతోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడులు విక్రయిస్తే దళారుల బెడద ఉండదు.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, శింగనపల్లె, అవుకు మండలం

క్వింటా రూ. 2,150 ప్రకారం విక్రయించాను



గత ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వం వివిధ పంటలకు విత్తనానికి ముందే మద్దతు ధర కల్పిస్తోంది. ఈ ఏడాది మొక్కజొన్నకు మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర ఉంది. నాకున్న ఆరు ఎకరాల్లో రబీలో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో ధర పలుకుతుండటంతో దిగుబడులను కల్లంలోనే అమ్ముకున్నాను. క్వింటా రూ.2,150 ప్రకారం ఉత్పత్తులను విక్రయించాను.

– హరినాథరెడ్డి, రైతు, ఆకుమల్ల, సంజామల మండలం

శాశ్వత లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం

కర్నూలు (లీగల్): శాశ్వత లోక్ అదాలత్‌లో ఒక కేసుకు సత్వర పరిష్కారం చూపామని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన కె. రామమద్దిలేటి వ్యవసాయదారుడు. ఈయన కుమారుడు కురువ మహేష్ 8వ తరగతి చదువుతున్నాడు. హాస్టల్ ఫీజుగా రూ.36,500 చెల్లించి తన కొడుకును శ్రీచైతన్య రెసిడెన్సీ స్కూల్‌లో 2023 జూన్ 14వ తేదీన చేర్పించాడు. హాస్టల్‌లో అందించే ఆహారం నాణ్యతగా లేదని, నిర్వహణలో లోపం కారణంగా మరుసటి రోజు తన కొడుకును హాస్టల్ నుంచి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. తాను కట్టిన ఫీజు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరగా.. రూ.17,500 మాత్రమే చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించకపోవడంతో రామమద్దిలేటి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. శాశ్వత లోక్ అదాలత్ బెంచ్ ముందు ఇరు పక్షాల మధ్య కుదిరిన రాజీ ప్రకారం రామమద్దిలేటికి రూ.25 వేలు, బకాయి కోసం రూ.19 వేలు, పరిహారం కోసం రూ.6 వేలు చెల్లించేందుకు ఒప్పుకున్నారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు సమక్షంలో ఇరుపక్షాల మధ్య రాజీ పరిష్కారం జరిగింది. శాశ్వత లోక్ అదాలత్‌లో పరిష్కారం అయిన కేసుపై అప్పీలు లేదని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు.

9 నుంచి చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ అధికారులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు శ్రీ చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కామేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పోస్టర్లను విడుదల చేశారు. వారం రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సోవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ పట్టెం గురుప్రసాద్, నంద్యాల డీఈసీ మోహన్, ఆలయ అర్చకులు, పండితులు పాల్గొన్నారు.